


బడి నిర్వహణకు నిధులు విడుదల

భైంసా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఆయా బడుల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటిని కేటాయించారు. సంబంధిత నిధుల ద్వారా పాఠశాలల్లో చిన్నచిన్న మరమ్మతులతో పాటు చాక్‌పీసులు, డస్టర్లు, ఇతర స్టేషనరీ సామగ్రి, ప్రయోగ పరికరాలు, రిజిష్టర్ల కొనుగోళ్లతో పాటు ఇంటర్నెట్ చార్జీల బిల్లుల చెల్లింపుల కోసం వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని పాఠశాలలకు మొత్తం రూ.1.56కోట్లు నిధులు విడుదల కావాల్సి ఉండగా, 50 శాతం రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు విడుదల చేస్తు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 628 ప్రభుత్వ పాఠశాలలున్నాయి.

రాజీ మార్గమే.. రాజ మార్గం

ఇంటర్వ్యూ Interview

దిశానిర్దేశం చేస్తున్న లోక్ అదాలత్‌లు

ఏళ్ల నుంచి కోర్టులలో మగ్గుతున్న అన్ని రకాల కేసులకు పరిష్కార మార్గం చూపిస్తున్న లోక్ అదాలత్‌ల ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోంది. వందలాది మంది తమ కేసుల పరిష్కారం కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతున్నారు. పెద్ద మొత్తంలో ఖర్చులు కూడా చేసుకుంటున్నారు. అయినా పరిష్కార మార్గం లభించక తల్లడిల్లుతున్న క్రమంలో అదాలత్‌లు వారికి చీకట్లో చిరుదివ్వెలుగా మారుతున్నాయి. రాజీ కుదుర్చుకోవడమే లోక్ అదాలత్‌ల ప్రధాన లక్ష్యంగా మారింది. న్యాయవాదుల పాత్ర కూడా ఎంతో కీలకంగా మారుతుంది. వారి సమయంలోనే పరస్పర చర్చలు జరుపుకొని రాజీ కుదుర్చుకుం టున్నారు. ఎక్కువ కేసుల కారణంగా ఒత్తిడికి లోనవుతున్న కోర్టులకు లోక్ అదాలత్ ఉపశమనం కలిగిస్తోంది. సివిల్ కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకు రికవరీలు, ట్రాఫిక్ చలానాలు, విద్యుత్ బిల్లులతో పాటు చిన్నపాటి క్రిమినల్ కేసులకు సైతం ఈ లోక్ అదాలత్‌లో పరస్పరం రాజీ కుదుర్చుకునే అవకాశం ఉంటుంది. ఈనెల 13న నిర్మల్‌లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కోసం ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో లీగల్ అథారిటీ సెల్ నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ పాఠకుల కోసం..

- నిర్మల్, ఆంధ్రజ్యోతి

ప్రశ్న: జాతీయ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి ?

జవాబు: ప్రజలకు తక్కువ ఖర్చుతో, వేగంగా, సులభంగా న్యాయం అందించడం ప్రధాన ఉద్దేశ్యం. వివాదాలను సామరస్యంగా పరిష్కరించడం, పెండింగ్ కేసులో భారాన్ని తగ్గించడం అందరికీ వేగవంతమైన చౌకైన న్యాయాన్ని అందించడం.

ప్రశ్న: ఈ నెల 13న జరగబోయే లోక్ అదాలత్‌లో ఎన్ని కేసులు పరిష్కారమ అవుతాయని అంచనా వేస్తున్నారు...?

ఖచ్చితమైన సంఖ్య మారవచ్చు. కానీ వేల సంఖ్యలో కేసులు పరిష్కారమవుతాయని అంచనా.

ప్రశ్న: లోక్ అదాలత్‌లో సాధారణంగా ఏ రకాల కేసులు ఎక్కువగా పరిష్కారం అవుతాయి ?

సివిల్ కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకు రికవరీలు, ట్రాఫిక్ చలానాలు, విద్యుత్ బిల్లులు, చిన్నపాటి క్రిమినల్ కేసులు.

ప్రశ్న: ప్రజలకు న్యాయం త్వరగా అందించడంలో లోక్ అదాలత్ ఎలా సమాయపడుతుంది...?

దీర్ఘ కాలం కోర్టు విచారణ అవసరం లేకుండా, ఇరు పక్షాల సమ్మతి ఆధారంగా ఒకే రోజులో తీర్పు ఇస్తుంది.

ప్రశ్న: సాధారణ కోర్టుల కంటే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం పొందడంలో ఉన్న ప్రయోజనాలు ఏమిటి...?

తక్కువ ఖర్చు, వేగవంతమైన పరిష్కారం, ఇరు పక్షాల సమ్మతి, ఎలాంటి అప్పీల్ అవసరం లేకపోవడం.

ప్రశ్న: లోక్ అదాలత్‌లో పరిష్కారం అయిన కేసులకు ఎలాంటి చట్టబద్ధత ఉంటుంది...?

లోక్ అదాలత్ తీర్పు సాధారణ కోర్టు తీర్పు మాదిరిగానే చట్టబద్ధమైనదే. తరువాత దానిపై అప్పీల్ చేయలేరు.

- అన్ని రకాల కేసుల పరిష్కారానికి అవకాశం
- పరస్పర చర్చలు, అవగాహనే ప్రధానాంశం
- 13న జాతీయ మెగా లోక్ అదాలత్ కోసం భారీ ఏర్పాట్లు
- లోక్‌అదాలత్ తీర్పునకు అప్పీల్ ఉండదు
- జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

ప్రశ్న: లోక్ అదాలత్‌లో న్యాయవాదుల పాత్రను మీరు ఎలా చూస్తారు...?

న్యాయ వాదుల పాత్ర చాలా ముఖ్యమైనది. ఇరు పక్షాల మధ్య సమన్వయం కల్పించడం, చట్టపరమైన సలహాలు ఇవ్వడం, సరైన పరిష్కారం దోవ చూపడం.

ప్రశ్న: భవిష్యత్తులో లోక్ అదాలత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఏమిచేయాలి...?

గ్రామీణ స్థాయికి విస్తరించాలి. టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలి. అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలి.

ప్రశ్న: ఈసారి లోక్ అదాలత్‌లో ప్రాధాన్యతనిచ్చే ప్రత్యేక విభాగాలు ఏవైనా ఉన్నాయా...?

ట్రాఫిక్ చలానాలు, బ్యాంకు రికవరీలు, కుటుంబ కేసులు, పెండింగ్ బిల్లులు వంటి కేసులకు ప్రాధాన్యం.

ప్రశ్న: సాధారణ ప్రజలకు లోక్ అదాలత్‌లో తమ కేసులు ఎలా నమోదు చేసుకోవచ్చు...?

తమ కేసు పెండింగ్‌లో ఉన్న కోర్టు లేదా న్యాయ సహాయ కేంద్రం (లీగల్ సర్వీస్ అథారిటీ) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రశ్న: జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఎంత మంది లబ్ధి పొందారు...?

ప్రతిసంవత్సరం వేలాది మంది లబ్ధి పొందుతున్నారు. జిల్లా స్థాయిలో పెద్దసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి.

ప్రశ్న: లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం కావడం వల్ల కోర్టుపై ఎంత వరకు భారం తగ్గుతుంది...?

వేల సంఖ్యలో పెండింగ్ కేసులు క్లియర్ అవుతాయి. దీంతో సాధారణ కోర్టులపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.

ప్రశ్న: ప్రజల్లో లోక్ అదాలత్‌పై అవగాహన పెంచడానికి మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆడియో, వీడియోల రూపంలో విస్తృత ప్రచారం జరుగుతుంది. ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాము.



ఎస్పీ జానకి షర్మిల

ప్రశ్న: ఈసారి లోక్ అదాలత్‌లో ఏవైనా కొత్త పద్ధతులు లేదా సాంకేతికతలు ఉపయోగించనున్నారా...?

డిజిటల్ మాధ్యమాల ద్వారా కేసుల వివరాలు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, వర్చువల్ హియరింగ్ వంటి సాంకేతికతలు వినియోగిస్తారు.

ప్రశ్న: ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మీరు ఏమి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు...?

మా కేసులు త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కారం కావాలనుకుంటే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అందరికీ విజ్ఞప్తి.

ముంపు ప్రాంతాల పరిశీలన

బాసర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల గోదావరి వరదతో నీటమునిగిన పంట పొలాలలో బుధవారం ఎంపీ జీ.నగేష్ పర్యటించారు. వరదలో మునిగి పూర్తిగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని రైతులు ఎంపీని వేడుకున్నారు. ఎంపీ వెంట బబాసర మండల బీజేపీ నాయకులు సతీశ్వర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, బీజేపీ బాసర మండల అధ్యక్షులు పి.సాయినాథ్‌పటేల్ ఉన్నారు.

మినీ ట్యాంక్ బండ్ లేక్‌వ్యూ పాయింట్‌ను ప్రారంభించిన మంత్రి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లేక్‌వ్యూపాయింట్‌ను ప్రారంభించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ (జిల్లా ఇన్‌చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు, శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు.

రైతులందరికీ నష్టపరిహారం...

సోన్ : మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆస్ట్రానమీ ల్యాబ్‌ను రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సాయంత్రం సందర్శించారు. ల్యాబ్‌లో విద్యార్థులకు అంతరిక్షంపై అవగాహన కలిగించేలా ఏర్పాటు చేసిన పరికరాలు, నమూనాలను మంత్రి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పరిశీలించారు.

పందులు ధ్వంసం చేసిన పంట పరిశీలన

దిలావర్‌పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పందులు గుంపులుగా మొక్కజొన్న, పత్తి పంటలపై ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. బుధవారం ఎఫ్‌బీవో మీనా, పంచాయతీ కార్యదర్శి సునీల్ పం దుల దాడితో ధ్వంసమైన పంటలను పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

హాకీ నుంచి ల్యాప్‌టాప్‌ల వరకు

- బాసర ఆర్జీయూకేటీలో సమస్యలకు మంత్రి జూపల్లి పరిష్కారం
- విద్యార్థులతో ముఖాముఖీ
- ఉత్సాహం నింపిన పర్యటన



ఆర్‌జీయూకేటీలో విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

బాసర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాసర పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం సందర్శించారు. తొలిసారిగా క్యాంపస్ వచ్చిన ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను ఒక్కొక్కటిగా విన్న మంత్రి జూపల్లి... హాస్టల్ భోజనం నుంచి క్రీడా మైదనం వరకు, ఫ్యాకల్టీ కొరత నుంచి ల్యాప్‌టాప్ వరకు విద్యార్థుల గోడు విన్నారు.మంత్రి కూడా వెంటనే స్పందించి తక్షణ పరిష్కారాలకు ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఓ సినీ గీతాన్ని ప్రస్తావిస్తూ, ఒక్కటే జననం, ఒక్కటే మరణం పాటను వినిపించి విద్యార్థుల్లో ఉత్తేజం నింపారు.

- భోజన-ఫ్యాకల్టీ లోపాలపై ఆరా...

ముందుగా హాస్టల్ భోజనంపై విద్యార్థులకు అడిగిన మంత్రి, భోజనం నాణ్యత సరిగా లేదా అన్న ప్రశ్నకు వారు చెప్పిన గోడు విన్నారు. ఫ్యాకల్టీ తగినంత లేరన్న అంశంపై వెంటనే దృష్టి సారిస్తానని స్పష్టం చేశారు.

- హాకీకీ గ్రీన్ సిగ్నల్. . .

మీరు ఏ ఆటలు ఆడుతున్నారు...? అని అడిగినప్పుడు, హాకీ లేదు అని విద్యార్థులు చెప్పగా.. వీసిని పిలిపించి స్థలాన్ని నిర్ధారించి " తక్షణమే హాకీ ఆల ప్రారంభించండి అని ఆదేశించారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ కోసం కోటి రూపాయల నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

- మైదానాల సమస్యలకు పరిష్కారం...

క్రికెట్ మైదానం నీటమునిగిపోతుందని విద్యార్థులు చెప్పగా.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వెంటనే మరమ్మత్తులు చేయండి.. అని ఆదేశించారు. క్రీడలకు పరికరాలు సరిపోవడం లేదని వినిపించగా, ఎక్కువ సమకూర్చుతామని హామి ఇచ్చారు.

- ల్యాప్‌టాప్‌ల డిమాండ్....

కొత్త ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలి, కాని పాతవే ఇస్తున్నారు అని విద్యార్థుల ఫిర్యాదుపై "అవసరమైన నిధులు ఎంత కావాలో వీసీ చెప్పండి" అని ఆదేశించారు. కంప్యూటర్ బేస్డ్ లెర్నింగ్ అవసరం ఉందని విద్యార్థులు కోరగా సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు.

పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

నిర్మల్ రూరల్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని కొండాపూర్ సమీపంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణం బుధవారం సాయంత్రం ప్రభుత్వ పథకాల పండుగ వేదికగా మారింది. మంత్రి ఆధ్వర్యంలో వివిధ పథకాల లబ్ధిదారులకు అర్హత పత్రాలు, చెక్కులు పంపిణీ చేశారు.

మంత్రి జూపల్లికి వినతుల వెల్లువ



వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా నాయకులు

బాసర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాసర పర్యటనకు బుధవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివిధ వర్గాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. రైతు సమస్యలపై భారతీయ కిసాన్‌సింగ్ రైతు సంఘం నాయకులు బండారి ఆనంద్ మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఇటీవల వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం యాసంగి పంట కంటే ముందే పంపిణీ చేయాలని, సోయా వరి పంటల కొనుగోలు కేంద్రాలను సెప్టెంబర్ చివరి వారంలో ప్రారంభించాలని, ప్రతిసారి ఆలస్యంగా ప్రారంభించడం వల్ల రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుందని చెప్పారు. అదేవిధంగా బాసర ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. వరదల కారణంగా రైతుల నష్టపరిహారం అందజేయాలని బీజేపీ నాయకులు కూడా వినతిపత్రం అందించారు. బాసరలో వెలమ కమ్యూనిటీ భవనానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అదే విధంగా పర్యాటక శాఖలో పనిచేసే సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తెచ్చారు. బాసర ఆలయ అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలని ఆలయ పండితులు, భక్తులు మంత్రికి విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను మంత్రి నేరుగా విని పరిష్కారం కోసం సంబంధిత అధికారులను వెంటనే ఆదేశించారు. మరికొన్ని వాటికి హామీలు ఇచ్చారు.

పిడుగు పాటుకు రైతు కుటుంబం బలి

- భార్యా భర్తతో పాటు మరో వ్యక్తి దుర్మరణం
- పెంబిలో ఘటన



మృతదేహాలు

పెంబి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుకు ఒకే కు టుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన సంఘటన బుధవారం సాయంత్రం జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంబి మండలంలోని గుమ్మెన ఎంగ్లా పూర్ గ్రామంలోని తమ పత్తి చేనులో కలుపు తీయడానికి ఆలకుం ట ఎల్లయ్య (37), ఆయన భార్య ఆలకుంట లక్ష్మి(32), మేనమామ బండారి వెంకన్న(50) ఉదయం వెళ్లారు. సాయంత్రం వర్షం ఉరు ములు బాగా రావడంతో తడవకుండా ఉండేందుకు పత్తి చేనులో ఏర్పాటు చేసిన మంచె కిందికి వెళ్లారు. అయితే మంచెపై పిడుగు పడటంతో భార్యా భర్తలైన ఎల్లయ్య, లక్ష్మితో పాటు మరో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. కాగా వర్షం బాగా కురుస్తుండటంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గుమ్మెన ఎంగ్లాపూర్‌కు వెళ్లలేకపోయారు.

నకిలీ పత్రాలపై విచారణ

నర్సాపూర్(జి), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్(జి) గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఒకే వ్యక్తి రెండు రకాల మోసాలకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి 8 డిసెంబరు 2022న పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో మల్టీపర్పస్ వర్కర్, మేజర్ గ్రామపంచాయతీ కారోబార్‌గా పని చేస్తున్న కోటగిరి చిన్నయ్య ఈ మోసాలకు సూత్రధారి అని తేలింది. చిన్నయ్య తన అధికార హోదాను దుర్వినియోగం చేస్తూ, ఠాకూర్ జగదీష్ సింగ్ ఇంటి నిర్మాణానికి నకిలీ పత్రాలను సృష్టించాడు. ఈ పత్రాలపై నకిలీ పంచాయతీ స్టాంపులు, నకిలీ సంతకాలను ఉపయోగించి బ్యాంకు రుణం పొందడానికి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లినప్పుడు అధికారులు గుర్తించారు. బతుకుతెరువు కోసం విదేశాలకు వెళ్లి గుండెపోటుతో మరణించిన కోడేముత్యం అనే వ్యక్తి పేరుతో రైతు బీమా నిధులను కాజేసిన వ్యవహారం కూడా ఇదే వ్యక్తి ప్రమేయంతో జరిగిందని తేలింది. ముత్యం 2018లోనే మరణించినప్పటికీ, చిన్నయ్య 2020లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నకిలీ పత్రాన్ని ఉపయోగించి మండల వ్యవసాయ విస్తరణ అధికారి లాగిన్ ద్వారా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఫలితంగా రైతు కుటుంబానికి రూ.5 లక్షలు రైతు కుమారుడి ఖాతాలోకి మళ్లినట్లు తెలిసింది. ఐదేళ్లుగా అనుమానాలకు తావిచ్చిన ఈ మోసం ఒక వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఇటీవల సొమ్మును పంచుకున్న ఒక వర్కర్ ఖాతాలో తేడాలు రావడంతో ఈ విషయం బయటపడింది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నత స్థాయి విచారణ జరిపిస్తే మరిన్ని పేర్లు బయటపడతాయని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ఈ రెండు కేసులపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

- పత్రాల జారీ విధానం మారింది.. ఎంపీవో తిరుపతి రెడ్డి

నర్సాపూర్(జి) మండలంలో 2019 నుంచి జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీవిధానం పూర్తిగా మారిపోయింది. గతంలో ఉన్న మాన్యువల్ పద్ధతి స్థానంలో పౌరనమోదు వ్యవస్థ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం-సీఆర్‌ఎస్) కింద డిజిటల్ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ మార్పు వల్ల 2020 సంవత్సరంలో నర్సాపూర్(జి) గ్రామ పంచాయతీ నుంచి మాన్యువల్‌గా ఎటువంటి మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయ లేదు. మరణ ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారు సీఆర్‌ఎస్ ఆన్‌లైన్ విధానం ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని, గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మాన్యువల్ పత్రాలు ఏవి జారీ కాలేదు.

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత

సారంగాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల స్వర్ణప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యము 1183 అడుగులకు గాను 1183 అడుగులు వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు గేటును ఎత్తి 2000 క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతానికి వదిలి పెట్టినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో స్వర్ణ వాగు పరివాహక ప్రాంత రైతులు కూలీలు అప్రమత్తముగా ఉండాలని అధికారులు తెలిపారు.

యూరియా కోసం పడిగాపులు



ఖానాపూర్ పీఏసీఎస్ ఎదుట పడిగాపులు కాస్తున్న రైతులు

భైంసా : వారం రోజులుగా యూరియా బస్తాల కోసం రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు కొద్దిమేర తొలగిపోయాయి. బుధవారం జిల్లాలోని అధిక శాతం ప్రాంతాలకు యూరియా బస్తాల సరఫరా జరిగింది. వ్యవసాయాధికారులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం జిల్లాకు 810 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వల కేటాయింపులు జరిగింది. ఇందులో నుంచి బుధవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని విక్రయ కేంద్రాలకు 650 మెట్రిక్ టన్నుల మేర సరఫరా అయింది. డిమాండ్‌కు అనుగుణంగా కొన్ని ప్రాంతాల్లోని విక్రయ కేంద్రాలకు 40 మెట్రిక్ టన్నులు, మరికొన్ని విక్రయ కేంద్రాలకు 20 మెట్రిక్ టన్నులు, ఇంకొన్ని విక్రయ కేంద్రాలకు 10 మెట్రిక్ టన్నుల మేర సరఫరా జరిగింది. భైంసాలోని మిర్జాపూర్ సొసైటీకి 20 మెట్రిక్ టన్నుల మేర యూరియా బస్తాల సరఫరా అవ్వగా సొసైటీ నిర్వాహకులు ఒక్కో రైతుకు మూడుబస్తాల మేర విక్రయించారు. యూరియా బస్తాల సరఫరా అవుతున్న ముందస్తు సమాచారం మేరకు వాటి కొనుగోళ్ల కోసం రైతాంగం ఉదయం వేళనే విక్రయ కేంద్రాలకు అధికంగా తరలి వెళ్లారు. దీంతో అక్కడి ప్రాంతాల్లో రద్దీ ఏర్పడింది.

ఖానాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా కోసం రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. ఖానాపూర్ పీఏసీఎస్ ఎదుట, గోసంపల్లి గ్రామ పంచాయతీ వద్ద బుధవారం రైతులు యూరియా కోసం భారీగా బారులు తీరారు. కాగా గత నాలుగైదు రోజులుగా నిత్యం యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయానికి రావడం యూరియా లేదని చెప్పడంతో తిరిగి వెళ్లిపోవడం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలో యూరియా రావడంతో రైతులంతా యూరియా కోసం ఎగబడ్డారు. రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఖానాపూర్ మండల వ్యవసాయ అధికారి జగదీశ్వర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రైతులందరికీ సరిపడా యూరియా అందుబాటులో ఉంచుతామని, ఎవరు ఆందోళన చెందవద్దన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం నిరసన



భైంసాలో నిరసనలో విద్యార్థులు, ఆద్యాపక బృందం

భైంసా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోనున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భైంసాలో జీపీఎల్ లడ్డా డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు చేపట్టిన నిరసనలు హోరెత్తాయి. బుధవారం మధ్యాహ్నం కళాశాల ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, విద్యార్థులు కళాశాల నుంచి పట్టణ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గాల మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. పెండింగ్ బకాయిల చెల్లింపులు వెంటనే చేపట్టాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ప్రధాన కూడలీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల చెల్లింపులు జరుగకపోవడం మూలంగా ఎదురవుతున్న అవస్థలపై విద్యార్థులు, కళాశాల నిర్వాహణ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆద్యాపక బృందం చేపట్టిన ప్రదర్శనలు సమస్య తీవ్రతకు అద్దం పట్టాయి. గంటన్నరకు పైగా కాలం నిరసనల హోరు కొనసాగింది.

గడ్డెన్న ప్రాజెక్టు మూడువరద గేట్ల ఎత్తివేత

భైంసా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో గడ్డెన్న ప్రాజెక్టులోకి బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 11 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు ప్రాజెక్టు నిర్వాహణాధికారులు మూడు వరద గేట్లను ఎత్తివేసి దిగువనున్న సుద్దవాగులోకి 16 వేల క్యూసెక్కుల వరద నీటిని వదిలివేసారు. మధ్యాహ్నం వేళలో ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు నిర్వాహణాధికారులు వరద గేటును ఎత్తివేసి దిగువన ఉన్న సుద్దవాగులోకి 1100 క్యూసెక్కుల నీటిని వదిలివేశారు. తదనంతరం పెరిగిన ఇన్‌ఫ్లోకు అనుగుణంగా రాత్రి 9 గంటల ప్రాంతంలో మరో రెండువరద గేట్లను ఎత్తివేసి మొత్తం మూడువరద గేట్ల ద్వారా సుద్దవాగులోకి 16 వేల క్యూసెక్కుల వరద నీటిని వదిలిపెట్టారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, నీటినిల్వ సామర్థ్యం 1.83 టీఎంసీలు ఉండగా రాత్రి 9 గంటల ప్రాంతంలో ప్రాజెక్టు నీటి మట్టం 358.7 మీటర్లు, నీటి నిల్వలు 1.83 టీఎంసీలుగా ఉన్నాయి. సుద్దవాగు బైపాస్ రోడ్డు వంతెన నీటి మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎస్‌బీఐ ఏటీఎంలో చిరిగిన నోట్లు..

ఉట్నూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారుల నిర్లక్ష్యం వల్ల బ్యాంకు ఏటీఏంలో చిరిగిన నోట్లు వచ్చాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు విమర్శించారు. మంగళవారం సాయంత్రం 6-15 గంటలకు ఏటీఎం నుంచి డబ్బులు తీయగా రెండు రూ.500 నోట్లు చినిగిన నోట్లు వచ్చాయన్నారు. అయితే, అదే సమయంలో బ్యాంకు అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది కలిగిందన్నారు. ఇదే పరిస్థితి సామాన్యులకు ఎదురైతే వారి పరిస్థితి ఏమిటని అన్నారు. ఏటీఎంలో డబ్బులు పెట్టె ముందు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ష్యూరిటీలు సమర్పించని ఇద్దరికి జైలు

ఉట్నూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సబ్ కలెక్టర్ ఉట్నూర్ ఆదేశాల మేరకు, మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఇద్దరిని సరైన సమయంలో ష్యూరిటీలు సమర్పించనందుకు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ బుధవారం ఆరు నెలల జైలు శిక్ష విధించారు. పాత కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను బైండోవర్ ప్రక్రియలో భాగంగా నిర్ణీత కాలంలో తగు ష్యూరిటీలు సమర్పించనందున వారిని ఆరు నెలల పాటు జైలుకు తరలించాలని ఉట్నూర్ పోలీసుల ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం నిందితులను బుధవారం ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించడం జరిగిందని ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల ఢీ

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలైన ఘటన బుధవారం మండలంలోని దన్నోరా(బి) గ్రామం సమీపంలో ప్రధాన రహదారిపై జరిగింది. ప్రత్యేక సాక్షులు, 108 పైలెట్ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్‌కు చెందినసంతోష్ తన స్నేహితుడు బాలాజీతో కలిసి ద్విచక్ర వాహనంతో దన్నోరా నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి ఎక్కుతుండగా ఎదురుగా గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వైపు కుటుంబ సభ్యులతో వస్తున్న ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన తిత్రే అర్జున్ ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మన్నూర్‌కు చెందిన సంతోష్‌కు ఎడమ చేయికి తీవ్ర గాయాలు కాగా, తోడుగా ఉన్న సూర్యవంశీ బాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన టిత్రే అర్జున్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా భార్య శారదాకు కుడి చేతికి గాయాలయ్యాయి. పెద్ద కొడుకు కార్తీక్‌కు ముక్కు, తలకు గాయమైందని, చిన్నకొడుకు టిత్రే రితిక్‌కు ఎడమ కాలుకు తీవ్ర గాయమైందని తెలిపారు. వెంటనే స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

ఒకరిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎడ్లు తరలిస్తున్న వ్యాపారిని ఆపి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఎండీ సాదిక్ అనే వ్యాపారి మంగళవారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి వెళ్లి వ్యాపార నిమిత్తం రెండు ఎడ్లను కొనుగోలు చేసి ఆటోలో ఇచ్చోడకు వెళుతుండగా.. మార్గమధ్యలో ఇంద్రవెల్లి మార్కెట్ వద్ద తగ్రే ఇందల్, మరికొందరు వ్యక్తులు కలిసి ఎడ్లు తరలిస్తున్న ఆటోను అడ్డుకుని, ఎడ్లకు సంబంధించిన పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. సాదిక్ ఫిర్యాదు మేరకు తగ్రే ఇందల్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి ఉట్నూర్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు సరిపడా యూరియా ఇప్పిస్తాం

బోథ్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేస్తున్న రైతాంగానికి సరిపడా యూనియన్ సరఫరా చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. రాజు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు గోదాం వద్దకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆత్మ చైర్మన్ సహకార సంఘం గోదాం చేరుకొని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు.

ఫిర్యాదుల పట్ల బాధ్యతగా మెలగాలి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలనీ ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసే సిబ్బంది విధులను పరిశీలించారు. మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత ఉంచుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలకు సంబంధించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన సూచనలు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించే దిశగా సిబ్బందిని కేటాయించి పరిష్కరించాలని సూచించారు. వీపీవో విధానాన్ని తప్పకుండా అమలు చేయాలని, వారంలో రెండు సార్లు గ్రామాలను సందర్శిస్తూ గ్రామాల్లో జరుగు అసాంఘిక కార్యకలాపాల పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సాయంత్రం సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండింగ్స్ లేకుండా ఉండాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని రాజీ కుదురుచుకుంటున్న వారిని సంప్రదించి న్యాయబద్ధంగా రాజీ కుదుర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను 5ఎస్ విధానాన్ని అమలు చేసి ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్సై వి.విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ



బోరజ్ మండలంలో నీటమునిగి పాడైపోయిన సోయా పంట

అన్నదాత.. ఆగమాగం

(5వ పేజీ తరువాయి...)

కోరుతున్నారు. ప్రభుత్వం అందించే సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. చాలా గ్రామాల్లో పంట భూములు కోతకు గురై ఇసుక మేటలు, రాళ్లు, రప్పలతో కనిపిస్తున్నాయి. ఇలాంటి భూములను చదును చేసుకునేందుకు బ్యాంకులు వడ్డీ లేని రుణాలను అందించాలని రైతులు పేర్కొంటున్నారు. వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించి ఆపదలో ఉన్న రైతులను ఆదుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం త్వరగా నష్టపరిహారాన్ని అందించాలని కోరుతున్నారు. అలాగే సబ్సిడీపై ఎరువులు,విత్తనాలు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎకరాన రూ.25వేల పరిహారానికి డిమాండ్

ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గతేడు ఎకరాన రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించారు. అవి ఏమూలన సరిపోవడం లేదంటూ రైతులు చెబుతున్నారు. ఈ సారి కనీసం ఎకరాన రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి జోగు రామన్న కలెక్టర్‌ను కలిసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎమ్మెల్యే పాయల శంకర్, ఇన్‌చార్జీ మంత్రిని కలిసి ఎకరాన రూ.25 వేలు అందించాలని కోరారు. రైతులు ఇప్పటి వరకు 80 శాతం పెట్టుబడిగా పెట్టినట్లు పేర్కొంటున్నారు.దీంతో ఎకరాన రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేసినట్లు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా మళ్లీ పంటలను సాగు చేసుకునే అవకాశం లేని రైతులకు ఎకరాన రూ.50 వేలు చెల్లించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వం నష్ట పరిహారంపై ఒక స్పష్టమైన ప్రకటన చేస్తే రైతులకు కొంత భరోసా కలిగే అవకాశం ఉంటుంది.

ఐలమ్మకు ఘన నివాళి

చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బుధవారం ఘన నివాళ్లు అర్పించారు. దీనిలో భాగంగా నేరడిగొండ మండలం తేజాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాళ్లర్పించారు. ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, ఇచ్చోడలో రజక సంఘం ఆధ్వర్యంలో, తలమడుగులో రజక సంఘం ఆధ్వర్యంలో, బోథ్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో, అలాగే పలుచోట్ల ఐలమ్మకు ఘన నివాళ్లర్పించారు.



తేజాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్



ఇచ్చోడలో రజక సంఘం నాయకులు..



తలమడుగులో రజక సంఘపు నాయకులు..



బోథ్‌లో పాల్గొన్న రజక సంఘం సభ్యులు

డిగ్రీ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బోథ్ గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు పీజీ ఎంట్రెన్స్‌లో ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వంద లోపు ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించి అర్హత పొందినట్లు తెలిపారు. ఇందులో జి.పరశురాం హిందీ విభాగంలో 28వ ర్యాంకు, ఎం.సాయిచరణ్ ఎకాంలో 34, జి.కార్తిక్ హిందీలో 48, జి.రాము ఎంఎస్సీ మ్యాథమెటిక్స్‌లో 57వ, జాదవ్‌దేవిదాస్ హిందిలో 61, ఎస్.ప్రేమ్ హిందీలో 81వ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఖాళీ ప్లేట్లతో 104 ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్న 104 ఉద్యోగులు 5నెలల నుంచి వేతనాలు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఆందోళనలో భాగంగా బుధవారం ఖాళీ ప్లేట్లతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేదలకు ప్రభుత్వం అండగా నిలవాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురయితే చివరకు పుస్తెలతాడు అమ్ముకొని వైద్య చికిత్సలు చేయించుకునే దుస్థితి నెలకొందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అండగా నిలిచేలా, అనారోగ్యంతో ఆస్పత్రి చేరే పేదల కోసం ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రత్యేక వైద్య సేవలు అందించాలని కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం చేపట్టిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.9లక్షల 57 వేల విలువ చేసే 41 చెక్కులను బాధితులకు అందజేశారు.

ఆయిల్‌పామ్ గెలల కోత ప్రారంభం

తలమడుగు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న ఆయిల్‌పామ్ పంట కోతకు రావడంతో బుధవారం మండలంలోని ఉండం గ్రామానికి చెందిన యువరైతు మహేష్ జాదవ్ పంట క్షేత్రంలో జిల్లా రైతులు, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు, ప్రీ యూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. అంతకుముందు గెలలకు ఎమ్మెల్యే పూజ చేసి కోశారు.

కేజీబీవీలో పురుగుల అన్నం

(5వ పేజీ తరువాయి...)

వస్తున్నాయన్నారు. గతంలో పలుమార్లు ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయని విద్యార్థులు తెలిపారు. సంబంధిత ఘటనపై విషయం తెలుస్కున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హుటాహుటిన కేజీబీవీ పాఠశాలకు వెళ్లి నేరుగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల పట్ల అజాగ్రత్త వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారి వెంట తహసీల్దార్ జాడీ రాజా లింగు, మండల విద్యాధికారి పవార్ అనిత, ఆర్ఐ సురేందర్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు అడ శ్రీరాం, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్ రావు, బీజేపీ మండల అధ్యక్షుడు బిక్కు రాథోడ్, దీపక్ పెందుర్, తదితరులు ఉన్నారు.

ఎస్‌వోను సస్పెండ్ చేయాలి : యూఎస్‌ఎఫ్ఐ

నార్నూర్ కేజీబీవీ పాఠశాలలో భోజనంలో పురుగులు ఉండడం వల్ల విద్యార్థులు ఆందోళనకు దిగారని, దీంతో అధికారుల పనితీరు ఎలా ఉంది? అనేది అర్థమవుతుందని యూఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. ఎస్‌వో మీద వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లామొత్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్, అధ్యక్షులు షేక్ అల్తాఫ్, జిల్లా నాయకులు రాము, ఆమేర్, సాయి, తదితరులు ఉన్నారు.

సారంగాపూర్‌లో భారీ వర్షం

సారంగాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు బీరవెల్లి , స్వర్ణ, కౌట్ల(బి), ధని, ప్యారామూర్ గ్రామాలతో తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో వాగు, వంకలు వరద నీరుతో పొంగిపొర్లడంతో పాటు పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో పత్తి సోయాబీన్ వంటి పంటలు నీట మునిగాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెంబి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకెన గ్రామానికి చెందిన గుగ్లావత్ తవిర్య, లావుడ్యా శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందడంతో ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యాజాన్సన్ నాయక్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్ల నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకు లు గోవింద్, గంగారెడ్డి, గాండ్ల శంకర్, సురేష్, విలాస్, కొర్కుల ప్రదీప్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన అధికారి



ఇళ్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్

దస్తురాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దేవునిగూడెం, బుట్టాపూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను మండల ప్రత్యేక అధికారి ఏపీడీ నాగవర్ధన్, తహసీల్దార్ బత్తుల విశ్వంబర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిన ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు. వాటిని జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుంది

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని జిల్లా మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏఎన్ రెడ్డి ఒకేషన్ జూనియర్ కాలేజీ తెలంగాణ ప్రభుత్వం చేపట్టి 'మిషన్ పరివర్తన్ - నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావాలను వివరించారు.

'బస్సుల సంఖ్య పెంచండి'

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుంచి ఖానాపూర్ వెళ్లే రూట్‌లో కొండాపూర్ వద్ద బుధవారం పల్లె వెలుగు బస్సు ఫుట్ బోర్డుపై కొందరు మహిళలు నిల్చోని ఇలా ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం అదుపు తప్పిన కిందపడి తీవ్ర గాయాలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బస్సుల సంఖ్యను పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని, వెంటనే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'చాకలి ఐలమ్మ అడుగుజాడలో నడవాలి'

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మం దిరంలో బుధవారం చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ జీవితమే ఒక పోరాట గాథ అని అన్నారు. భూస్వాము ల దమనకాండకు వ్యతిరేకంగా, పేదల హ క్కుల కోసం ఆమె చేసిన త్యాగం, ధైర్యం నేటితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్ నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

సీపీఎం ఆధ్వర్యంలో...

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వసుధ, శంభు, పసివుద్దీన్, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం జిల్లా అధ్యక్షులు రత్నం తెలిపారు.

చాకలి ఐలమ్మకు ఎమ్మెల్యే ఏలేటి నివాళి...

చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినట్లు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఐలమ్మ ఆశయాలతో ముందుకు సాగాలని, వారి పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

భైంసా : బహుజన సమాజ హక్కులు, రైతుల ఆత్మ గౌరవం కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేపట్టిన ఉద్యమ స్ఫూర్తి గొప్పదని రజక సంఘం జిల్లా ప్రతినిధి, జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన నాయకులు సుంకెట మహేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని భైంసాలో రజక సంఘం, జనసేన పార్టీలు నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

ముథోల్ : తెలంగాణ సాయుధ పోరాట రజాకార్ల ఉద్యమం, భూస్వామ్య పెత్తందారుల విధానాలకు విరోచితంగా పోరాటాలు చేసిన ఘనత చాకలి ఐలమ్మదని కొనియాడారు. కార్యక్రమంలో ముథోల్ తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, రజక సంఘం నాయకులు నర్సయ్య, లస్మన్న, సాయి నాథ్, భూమేష్, బాలాజీ, మహేష్, సాయి లు, మాజీ ఎంపీటీసీ భూమేష్ పాల్గొన్నారు.

కుంటాల : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనం గా నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పడకంటి దత్తు, తదితరులు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

భైంసారూరల్ : చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సుష్మా రెడ్డి, రజక సంఘం అధ్యక్షులు లింగన్న అన్నారు. దేగాం గ్రామంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని జరుపుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తుది ఓటరు జాబితా విడుదల

భైంసా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ప్రాదేశిక ఎన్నికల కోసం గాను అధికారులు తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. జిల్లాలోని 18 మండలాల్లో 157 ఎంపీటీసీ ప్రాదేశిక కేంద్రాలలో తుది ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసి అధికారులు ప్రకటించారు. జిల్లాలో ప్రాదేశిక ఎన్నికల కోసం గాను మొత్తం 4,49,302 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 18 జడ్పీటీసీ స్థానాలతో పాటు 157 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. బాసర మండలంలో 15,728, భైంసా మండలంలో 33,970, దస్తురాబాద్ 12,894, దిలావర్‌పూర్ 18,744, కడెం 29,159, ఖానాపూర్ 23,657, కుబీర్ 40,625, కుంటాల 19,055, లక్ష్మణచాంద 24,577, లోకేశ్వరం 29,359, మామడ 26,072, ముథోల్ 28,754, నర్సాపూర్ (జి) 20,238, నిర్మల్ 22,751, పెంబి 10,886, సారంగపూర్ 39,516, సోన్ 21,801, తానూర్ 31,516 మంది ఓటర్లు ఉన్నారు.

ఉదయ్ కుటుంబసభ్యులను ఓదార్చిన న్యాయాధికారి



ఓదారుస్తున్న దృశ్యం

మామడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు న్యాయాధికారి జువ్వాడి శ్రీదేవి తమ వద్ద కొన్ని సంవత్సరాల నుంచి సహాయకుడిగా పని చేస్తున్న కొత్తపల్లి ఉదయ్ కుమార్(23) అనే యువకుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. మంగళవారం సాయంత్రం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి రావు, ఆయన సతీమణి హైకోర్టు న్యాయాధికారి జువ్వాడి శ్రీదేవి వద్ద కొన్నేళ్లుగా ఉదయ్ పనిచేస్తున్నాడు. సమాచారం తెలిసిన వెంటనే భార్యాభర్తలు ఉదయ్ స్వగ్రామం మామడ మండలం నల్దుర్తికి చేరుకున్నారు. తీవ్ర భావోద్వేగానికి గురైన జస్టిస్ శ్రీదేవి, ఆమె భర్త శ్రీహరి రావు ఉదయ్ కుటుంబసభ్యుల రోదనలు చూసి చలించిపోయారు. న్యాయాధికారి కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు టీవీ అందజేత



రాంటెక్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు టీవీ అందజేస్తున్న కదారి నరేష్

ముథోల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టింటమాస్ మెగాసన్ సంస్థ, గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాంటెక్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఆ ఫౌండేషన్ చైర్మన్ కదారి నరేష్ టీవీ అందజేశారు. విద్యార్థుల అభ్యాసానికి ఆధునికత సాంకేతికతను చేరువ చేయాలన్న ఉద్దేశంతో చైర్మన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ టీవీని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా డిజిటల్ విద్యను సులభంగా అలవర్చుకునేలా తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు బసవరాజు, రాజేశ్వర్, రజిత, గ్రామస్థులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు టిఫిన్ డబ్బాలతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కళాశాలలో భోజన సదుపాయాలు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు మధ్యాహ్నం కళాశాలకు డుమ్మా కొడుతున్నారన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి విద్యావ్యవస్థపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, అర్చన, కావ్య, సిద్ధార్థ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కార్యదర్శిగా లావణ్య



కార్యదర్శి లావణ్య

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన బి. లావణ్యను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు చైర్మన్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు.

నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు పితృవియోగం

లక్ష్మణచాంద, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్‌కు బుధవారం పితృవియోగం అయింది. ఈటెల శ్రీనివాస్ తండ్రి ఈటెల భూమన్న అనారోగ్యంతో మృతిచెందారు. మార్కెట్ కమిటీ కార్యవర్గంతో గజ్వేల్ టూర్‌లో ఉన్న శ్రీనివాస్ హుటాహుటిన లక్ష్మణచాంద చేరుకున్నారు. బుధవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డితో పాటు పలువురు జిల్లా, మండలస్థాయి నాయకులు ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'జీతాలు తక్షణం విడుదల చేయాలి'

ముథోల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్స్ (సీఆర్‌టీ) ఆరునెలలుగా జీతాలు అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం వారి వేతనాలను విడుదల చేయాలని బంజార సంఘం జిల్లా నాయకులు నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఆర్‌టీలు కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు.

'ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు'

కుంటాల, సెప్టెంబర్, 10 : (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితంలో నిత్యం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజలకు ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని మానసిక వైద్య నిపుణులు బంగారు సుధీర్ అన్నారు . ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కుంటాల మండలం సూర్యాపూర్ గ్రామంలో ప్రజలకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, డాక్టర్ కిషన్, ముత్యం రావు, పంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శివాజీ, గ్రామస్తులు ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

దిలావర్‌పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతో ఆరో గ్యం పదిలంగా ఉంటుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి అన్నారు. పదిరోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కాల్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు మౌనిక, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి జూపల్లి

బాసరలో ప్రముఖుల పూజలు

బాసర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం బుధవారం ప్రముఖులతో సందడిగా మారింది. మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన సందర్భంగా మంత్రితో కలిసి మాజీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు వేణుగోపాల చారి, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావుపటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకంటే ముందు ఎంపీ నాగేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.


సహకార సంఘం గూడెం వద్ద క్యూ లైన్‌లో నిల్చున్న రైతులు

ఇంకా యూరియా కరువు తీరలేదు

● క్యూ లైన్‌లోనే రైతన్న పడిగాపులు


గోదాంలో నిల్వ ఉన్న యూరియా

బోథ్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు యూరియా కోసం వాడిగాపులు కాస్తున్నారు. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం యూరియా వచ్చింది వచ్చినట్లే ఖాళీ అయింది. వారం రోజుల నుంచి పంటలకు వేసేందుకు యూరియా కోసం రైతు ఎదురు చూస్తున్నారు. ఇదే తరుణంలో బుధవారం ఉదయం 440 బస్తాల యూరియా సహకార సంఘం గోదాం చేరుకుంది. విషయం తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో యూరియా కోసం తరలి రావడం జరిగింది. దీంతో అధికారులు ఒక్కో రైతుకు ఇస్తామనడంతో క్యూ లైన్‌లో గంటల తరబడి నిలబడ్డారు.

● **పంటలు ఎదిగే సమయంలో కొరత..**

ప్రస్తుతం మొక్కజొన్న కంకి దశలో ఉండగా పత్తి పూతకాత దశలో ఉంది. అయితే ఇదే సమయంలో పంటలకు యూరియా అత్యవసరం అవసర మున్న సమయంలో యూరియా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక రైతు కేవలం రెండు బస్తాల యూరియా ఇస్తే ఏ మూలకు సరిపోదని రైతులు వాపోతున్నారు. అధి కారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యూరియాను సర ఫరా చేయాలని కోరుతున్నారు.

● **గ్రామాల రైతులకు అందని యూరియా**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకు యూరియా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. యూరియా వచ్చిన విషయం మండల కేంద్రానికి చెందిన రైతులకు తెలియడంతో ఒక్కసారిగా వచ్చి క్యూ లైన్లు ఇంటిల్లిపాది నిలబడుతున్నారు. దీంతో ఇతర గ్రామాల రైతులకు యూరియా అందకుండా పోతుంది. పత్తి పంటకు యూరియా వేసే సమయం చివరిది కావడంతో అధికారులు యూరియాను రైతులు అవసరాల మేరకు పంపించాల్సిందిగా కోరుతున్నారు. కాగా ఈ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడంతో మొక్కజొన్న పంటకు యూరియా అధికంగా అవసరం ఉంటుందని రైతులు అంటున్నారు. పంట సాగు నమోదు సమయంలో వ్యవ సాయ శాఖ అధికారులు ముందస్తుగా జిల్లా అధికారులకు యూరియా ఇండెంటు విషయంలో సరైన నివేదిక ఇచ్చి ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కావని రైతులు అంటున్నారు.

యూరియా కోసం రైతుల భిక్షాటన

ఇచ్చోడ, సెప్టెంబరు, 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యూరియా దొరకక రైతుల బతుకులు అగమయ్యాయని చివరికి రైతులు యూరియా కోసం ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ముక్రా (కె) గ్రామ రైతులు వారి ఆవేదనను తెలిపారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతులను మోసం చేసిందని కేసీఆర్ పాలనలో ఇంటికి యూరియా సంచులు వచ్చేవని కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎదురైందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరతతో ఆందోళన



నేరడిగొండలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

నేరడిగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా, ఎరువుల కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వానాకాల పంటల సాగు ఉత్సాహంగా సాగుతున్న సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఎరువుల డిపోలు, సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల వద్ద స్టాక్ లేకపోవడం వల్ల పంటల ఎదుగుదల దశలో ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. యూరియా కొరతతో ఆందోళన కొరత లేకుండా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గంజాయి సాగు చట్టరీత్యా నేరం


గంజాయి మొక్కలతో ఏఎస్పీ కాజల్‌సింగ్, ఎస్సైలు

సిరికొండ, సెప్టెం బరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను సాగు, వ్యాపారం , రవాణా చేయడం, చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీ సుకుంటామని ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. బుధవారం సిరికొండ, నేరడిగొండ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పలువురు రైతులు పంటచేలలో అక్రమంగా గంజాయి మొక్కలను సాగుచేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సీసీఎస్, ఇచ్చోడసీఐ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సిరికొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన సిడాం దేవ్ రావ్ తన పంట చేనులో సాగుచేసిన 66 గంజాయి మొక్కలను, నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిజిలి గ్రామానికి చెందిన పెందూర్ సీతాబాయి తన పంట చేనులో ఏడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని అట్టి వ్యక్తులపై ఆయా పోలీస్ స్టేషన్‌లో యందు ఎన్డీపీఎస్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, సీసీఎస్ ఎస్సై పి. చంద్రశేఖర్, ఎస్సైలు పురుషోత్తం, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- సుర్జాపూర్‌లో పలువురికి డెంగీ
- ప్రభుత్వ ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలు
- సామాన్యుడికి తప్పని తిప్పలు
- ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు
- అందిన కాడికి దండుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాలు


ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ విభాగంలో వివరాలు నమోదు చేయించుకుంటున్న రోగులు


చిన్నారికి రక్త పరీక్ష కోసం నమూనా సేకరిస్తున్న సిబ్బంది

ఖానాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలతో ఒక్కసారిగా గత నాలుగైదు రోజులుగా ఖానాపూర్ ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏ గ్రామంలో చూసిన ప్రతి ఇంట్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతమవుతూ దర్శనమిస్తున్నారు. ఎవరిని కదిలించిన జలుబు, దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, తలనొప్పి, తల తిప్పడం, వాంతులు రావడం లాంటి కారణాలు చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్న రోగులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్సలు పొందేందుకు పరుగులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఖానాపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఏ ప్రైవేట్ ఆసుపత్రి చూసిన వైరల్ ఫీవర్స్‌తో వచ్చే రోగులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలతో తప్పని తిప్పలు..

ఖానాపూర్ మండలంలో ప్రస్తుతం వైరల్ ఫీవర్స్‌తో పలు గ్రామాల్లో ప్రజలు మంచం పట్టారు. మండలంలో ప్రధానంగా సుర్జాపూర్ గ్రామంలో 25 మందికి పైగా డెంగీ వ్యాధి బారిన పడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. వీరంతా ఖానాపూర్, నిర్మల్, మెట్‌పల్లి, జగిత్యాల లాంటి పట్టణాలలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశించిన మేర సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న వేళ ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్లేట్లెట్స్ కౌంటింగ్ నిర్వహించేందుకు సౌకర్యం లేకపోవడం తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని చెబుతున్నారు. డెంగ్యూ, ప్లేట్లెట్ కౌంటింగ్ సహా ఏ రక్త పరీక్ష చేయాలన్నా నిర్మల్‌లో టీ హబ్‌కు రక్త నమూనాలను పంపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు ఖానాపూర్ ప్రభు త్వ ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు టీ హబ్‌కు రక్త నమూనాలను పంపిస్తే రాత్రి 8:30 నుంచి 9 గంటల సమయంలో సదరు రక్త పరీక్షల తాలూకు రిపోర్టు వస్తుం దని చెబుతున్నారు. డెంగ్యూ బారిన పడి ప్లేట్లెట్స్ తగ్గిపోతున్న రోగికి ఉదయం, సాయంత్రం ఖచ్చితంగా ప్లేట్లెట్స్ పరీక్షలను చేయించాల్సి ఉంటుందని వై ద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఖానాపూర్‌లో ప్లేట్లెట్స్ పరీక్ష నిర్వహించేందుకు సెల్ కౌంటర్ అందుబాటులో లేకపోవడం తో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించకుండా ప్రైవేట్ కు తరలి వెళ్తున్నట్లు చెబుతున్నారు. మరోవైపు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఎండీ ఫిజీషియన్ సేవలు అందుబాటులో లేకపోవడంతో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నందున ప్రజలు ప్రైవేట్ బాట పట్టక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందిన కాడికి దండుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాలు..

ప్రభుత్వ ఆసుపత్రిలో ఎండీ ఫిజీషియన్ సేవలు అందుబాటులో లేకపోవడం, రక్త కణాల పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో సెల్ కౌంటర్ సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులకు కొంతమంది ప్రైవేట్ యాజమాన్యాలు చుక్కలు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చిన రోగి డిశ్చార్జ్ అయ్యేసరికి బిల్లులు తడిసి మోపెడు అవుతుండడంతో సామాన్యుడికి జేబుకు చిల్లులు పడుతున్నట్లు చెబుతున్నారు. పలు రకాల రక్త పరీక్షల పేరిట డబ్బులు లాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా మొత్తానికి ఈ సీజనల్ వ్యాధులు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సైతం గత నాలుగైదు రోజులుగా నిత్యం 350 నుండి 400లకు పైగా ఓపీ నమోదవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆసుపత్రికి వచ్చే సామాన్యుడికి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎండి ఫిజీషియన్ వైద్యుడి నియామకంతో పాటు రక్త కణాల పరీక్ష నిర్వహించేందుకు సెల్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


టెంబిలో మథురా సమాజం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఘనంగా రుషి పంచమి వేడుకలు

బజార్ హత్నూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంజీరా తండా గ్రామంలో మథుర సమాజం వారు నిర్వహించే రుషి పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఇందులో భాగంగా దర్యావ్ సింగ్ మహారాజ్ శాలువాతో సన్మానించారు. అనంతరం మథుర సాంప్రదాయపు పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మథుర సమాజ ప్రజలు ప్రత్యేక వేష ధారణతో నగర వాయిద్యంపై నృత్యం చేశారు. వీరి వెంట మథుర సమాజ్ నాయకులు నానక్ సింగ్, ప్రతాప్ సింగ్, కైలాష్ సింగ్, చందర్ సింగ్, సరిచంద్, మంగల్ సింగ్, గులాబ్ సింగ్, మెర్చాన్, బాదల్ సింగ్, ఉత్తమ్ సింగ్ పాల్గొన్నారు.

రేపు తానూర్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు

భైంసా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 (శుక్రవారం)న తానూర్ మండల కేంద్రంలోని డిస్కవరి డ్రీమ్స్ స్కూల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లుగా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కదం మోహన్‌రావ్ పాటిల్, ఉప్పు రవీందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ యోగా పోటీల్లో 8 నుంచి 80 ఏళ్ల వయస్సు గల స్త్రీపురుషులు పాల్గొనవచ్చునన్నారు. వివరాలను సెల్ నెంబర్లు 96404 63434 , 96404 71787 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంద్రవెల్లి అమరత్వాన్ని గుర్తించని ప్రభుత్వం

- ఇంద్రవెల్లి స్మృతి వనం.. ప్రారంభానికి సిద్ధం
- నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు సమాయత్తం



స్మృతివనంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ చిత్ర పటాలు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర దశాబ్దాల క్రితం 1981 ఏప్రిల్ 20న భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నినాదంతో ఆదివాసీలు చేపట్టిన ఆందోళన రక్తసిక్తమైంది. పలువురు ఆదివాసీ గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. వారి గుర్తుగా ఇంద్రవెల్లిలో ఆదివాసీ అమరవీరుల స్మారక స్థూపం నిర్మించారు. దీంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 20న పోలీసులు నిర్బంధం విధించే వారు. అయినప్పటికీ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 20న ఆదివాసులు ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నివాళులు అర్పిస్తూ వస్తున్నారు.

● **రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ - సీఎం రేవంత్ రెడ్డి చొరవతో అధికార గుర్తింపు**

ఇంద్రవెల్లి అమరవీరులను స్మరించుకునేందుకు అధికారికంగా ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం నుంచే అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ నుంచి శంఖారావం పూరించారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తన తొలి బహిరంగ సభ ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద దళిత, గిరిజన దండోరా సభను నిర్వహించారు. ఈ సభకు లక్షకు పైగా జనం రావడం చూసి ఆ సభలో ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని చారిత్రాత్మక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. అన్నట్లుగానే ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని స్మృతి వనంగా గురిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అమరవీరుల స్మారక స్థూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దేందుకు రూ.కోటి నిధులను కూడా వెంటనే మంజూరు చేశారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి అమరవీరుల పోరాట స్ఫూర్తిగా దళిత, గిరిజన దండోరా సభతో అసెంబ్లీ ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం రేవంత్ రెడ్డి 2024 ఫిబ్రవరి 2న లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. కోటితో స్థూపం చుట్టూ ప్రహరీ.. సీసీ రోడ్డు నిర్మాణం, గెస్ట్ రూమ్, స్మృతివనం పనులను చేపట్టారు. అంతేకాదు ఇక్కడ తొలిసారిగా గత ఏప్రిల్ 20న ఆదివాసీ గిరిజన అమరవీరులకు నివాళులు అర్పించేందుకు అధికారికంగా అనుమతులు కూడా జారీ చేశారు. ఈ సందర్భంగా అమరులైన 15 మంది కుటుంబాలకు మోడల్ ఇందిరమ్మ ఇండ్లతో పాటు రూ. 1.5 కోట్లతో ట్రైకార్ ద్వారా వివిధ రుణాలను మంత్రి సీతక్క చేతుల మీదు గా అందజేశారు. ఇంద్రవెల్లి ఆదివాసీ గిరిజన అమరవీరుల స్మారక స్థూపం వద్ద ఏర్పాటు చేసిన స్మృతి వనాన్ని గురువారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారికంగా ప్రారంభించనున్నారు. ఆ దిశగా అధికారులు స్మృతి వనం ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నారు. ఈ స్మృతి వనాన్ని ఆదివాసీ అమరులకు అంకితం చేయనున్నారు.

● **స్మృతి వనం ఏర్పాటు చేయడం హర్షనీయం**

ఆదివాసుల పోరాటాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇంద్రవెల్లి ఆదివాసుల అమరవీరుల స్థూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనం. ఆదివాసీ చరిత్రలో సువర్ణాధ్యాయంగా చెప్పవచ్చు. ఆదివాసీ జాతి ఉద్దరణకు పాటు పడుతున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

- తొడసం నాగోరావు,
రగల్ జెండా ఆశయ సాధన సమితి అధ్యక్షుడు

విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన

కుంటాల, సెప్టెంబర్ 10 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శమోడల్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సాంఘీక శాస్త్రంలోని పాఠ్యాంశంలో భాగంగా ద్రవ్య బ్యాంకింగ్ అనే అంశంపై క్షేత్ర స్థాయిలో విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుంటాల యూనియన్ బ్యాంక్‌కు విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ విద్యార్థులకు బ్యాంకులో ప్రతినిత్యం చేపట్టే కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు హైమతోద్దిన్, నరేష్ కుమార్, రమేష్, విద్యార్థులు ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఏఎస్పీ కాజల్ సింగ్


ఏఎస్పీ కాజల్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్సై ఇమ్రాన్

నేరడిగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎటు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ కాజల్ సింగ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక నేరడిగొండ పోలీస్‌స్టేషన్ సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మండలంలో గంజాయి సాగుపై దృష్టి సారించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో గొడవల్లో పాల్గొంటే జీవితాంతం కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బండారి రాజు, ఎస్సై ఇమ్రాన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, దానే బేలాపూర్ రోడ్,మహాపే,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదీన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేదీ: 20-09-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.6-7-741&2, 2 వ అంతస్తు,భుక్తాపూర్,ఆదిలాబాద్,ఆదిలాబాద్‌జిల్లా,తెలంగాణ

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ADILDPJ2503100002	CHOUTIPELLY NIKHIL	ADILDPJ2503200003	GAJA NIKITHA
ADILDPJ2503260008	YENAGANDULA RAGHU TEJA GO	ADILDPJ2503270002	BHAGATH MADHUKAR

వేలం తేదీ: 20-09-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.5-7-100/5, 1 వ అంతస్తు,అప్పలనర్సయ్య కాంప్లెక్స్, నిర్మల్ - 504106,నిర్మల్ జిల్లా,తెలంగాణ

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
NIRMLPJ2503040014	NAJMA BEGUM	NIRMLPJ2503120010	RAMPELLI RAMESH
NIRMLPJ2503050003	RAJU YATAKARI	NIRMLPJ2503170020	THODISHETTY KALAVATHI
NIRMLPJ2503050011	YATAKARI SRINIVAS	NIRMLPJ2503200006	KUNA LAXMI
NIRMLPJ2503050004	RAJU YATAKARI	NIRMLPJ2503200016	VIJAY SONNA
NIRMLPJ2503070004	KANUGULA MOUNIKA	NIRMLPJ2504010005	VELMALA RAMU
NIRMLPJ2503080037	SHAMSHODDIN MOHAMMED	NIRMLPJ2503200008	PUSALA SANTHOSH
		NIRMLPJ2503200004	MOUNISH ADUMULLA
NIRMLPJ2503080035	DEVANNA GAJIGIRI	NIRMLPJ2503200003	SAI KUMAR ARMOOR
NIRMLPJ2503100006	PUNNA AKSHAYA	NIRMLPJ2503200009	PUSALA SANTHOSH
NIRMLPJ2503110023	ODNALA LAXMI	NIRMLPJ2503250001	PARSA MAMATHA
NIRMLPJ2503110003	ARSHAD KHAN	NIRMLPJ2503260011	SURESH KUMAR GUDALA
NIRMLPJ2503110024	BATTU NITHISH	NIRMLPJ2503270002	CHANDALA AKASH

వేలం తేదీ: 20-09-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 7-8-127, దేవిరోడ్,దేవిమాతఆలయంప్రక్కన,నిజామాబాద్, జిల్లా,నిజామాబాద్-503001,తెలంగాణ

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
BHGALPJ2503100011	THOGITI NARESH	BHGALPJ2503280009	BASAKONDA GOVARDHAN
BHGALPJ2412100007	PALTHYA RAJITHA		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ యం.అశోక్ కుమార్** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేదీ: 11.09.2025
స్థలం: నిజామాబాద్
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఒక్క లారీ ఆగితే.. వందల వాహనాలు ఆగాల్సిందే


వంతెనపై ఆగిపోయిన లారీ

ఆదిలాబాద్ నుంచి బేల, జైనథ్ మండలాలతో పాటు మహారాష్ట్రకు వెళ్ళే ప్రధాన దారుల్లో ఒకటైన తరణం వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. వాహనాల రాకపోకల కోసం ప్రత్యామ్నాయంగా చిన్న వంతెన నిర్మించినప్పటికీ నీటి ప్రవాహం పెరిగినా, వంతెనపై వాహనాలు ఆగిపోయినా అక్కడి నుంచి ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. తాజాగా మంగళవారం వంతెనపై ఓ లారీ నిలిచిపోవడంతో ఇరువైపులా వందల వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అత్యవసర పనుల కోసం వచ్చిన వారు లాండ సాంగి మీదుగా ప్రయాణం సాగించారు. వంతెన కష్టాలు ఇంకెన్నాళ్లు ఎదుర్కోవాలో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు, లారీల డ్రైవర్లు వాపోతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

ఫొటో న్యూస్


భోరజ్ వద్ద ఆగిపోయిన లారీలు


తరణం వద్ద ఆగిపోయిన లారీలు

వేడుక ఏదైనా.. సందర్భం ఎటువంటిదైనా
- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్

మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 11 సెప్టెంబరు 2025


బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

బోథ్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గురువారం మండల కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. అయితే మంత్రి మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన అనంతరం స్థానికంగా ఉన్న పరిచయ గార్డెన్‌లో పలువురు లబ్ధిదారులకు వాటికి సంబంధించిన పత్రాలు అందించనున్నారు. అయితే మంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించేందుకుగాను జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల తహసీల్దారులతో చర్చించారు. అయితే మంత్రి సమావేశం కానున్న వేదికను జడ్పీ సీఈవోజితేందర్ రెడ్డితో పాటు హౌసింగ్, తదితర శాఖల అధికారులు పరిశీలించారు.

జూనియర్ కళాశాల తనిఖీ

ఉట్నూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ గణేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అటెండెన్స్ పెంచాలని, తరగతులు సరైన సమయాన్ని తీసుకోవాలని, సిలబస్ అనుకున్న సమయానికి పూర్తి చేయాలని, ఈసారి పోయిన సారి కంటే ఎక్కువ రిజల్ట్ తీసుకు రావాలని అధ్యాపకులకు డీఐవో సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనరాజ్, డీఐవో ఆఫీసు ఆదిలాబాద్ సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, వినోద్, లక్ష్మణ్, తిరుపతి, దత్తు, అశ్విన్‌చౌహాన్, నీలోఫర్‌రానా, సుధాకర్, అధ్యపకేతరులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీవోల కౌన్సెలింగ్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియామకం కానున్న గ్రామ పాలన అధికారుల పోస్టింగుకు సంబంధించి జిల్లాలో రెండువిడతల్లో నిర్వహించిన పరీక్షల్లో 83 మంది అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారికి కలెక్టర్ రాజర్షి షా నేతృత్వంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం నూతనంగా నియమితులైన జీపీవోలకు ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా దిశా నిర్దేశం చేశారు.

జిల్లాలో.. కురుస్తున్న అధిక వర్షాలతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలను వరదలు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అధిక వర్షాలతో పంట పొలాలు జౌకపట్టి పోయి పంటల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. జిల్లా సాధారణ వర్షపాతం 903.3 మి.మీ.లు కాగా, ఇప్పటి వరకు 1129.7 మి.మీ.ల అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో అధికంగా 25శాతం వర్షపాతం కురిసింది.


● భీంపూర్ మండలంలో నేలమట్టమైన పత్తి పంట

అన్నదాత.. ఆగమాగం

ఆదిలాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ యేడు జూన్, జూలై మాసాలలో లోటు వర్షపాతం నమోదైన ఆగస్టు 15 నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానా కాలం సీజన్‌లో 5లక్షల 72వేల 384 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా పత్తి పంటనే 4లక్షల 35వేల ఎకరాలలో సాగైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కురుస్తున్న అధిక వర్షాలతో ఆనంద పడాలో లేక బాధపడాలో అర్థంకాని పరిస్థితుల్లో అన్నదాతలు కనిపిస్తున్నారు. పంటలు నీటమునిగి 25 రోజులు గడిచి పోతున్నా.. ప్రభుత్వం పరిహారం ఊసెత్తడమే లేదంటున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం పంట నష్టంపై అధికారులు తుది నివేదికను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 12,775 మంది రైతులకు గాను 17,496.9 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు గుర్తించారు. ఇందులో అధికంగా పత్తి పంట 13804.11 ఎకరాలు, సోయాబీన్ 2941.28 గుంటలు, కంది 308 ఎకరాలు, మొక్కజోన్న 209 ఎకరాలు, మరో 151 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గురువారం జిల్లాలో ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వరదముంపు ప్రభావం, పంట నష్టంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు.

పంటల వారీగా నష్టం వివరాలిలా...

జిల్లాలో పంట నష్టం	:	17,496(ఎకరాల్లో..)
నష్టపోయిన రైతులు	:	12,775 మంది
ఇసుక మేటలు	:	380
పత్తి పంట	:	13,804
సోయాబీన్	:	2,941
కంది	:	308
మొక్కజొన్న	:	290
ఇతర పంటలు	:	151

- జిల్లాలో రైతులను నిండా ముంచిన భారీ వర్షాలు, వరదలు
- చేతికొచ్చిన పంటలు చేజారి పోవడంతో పలుచోట్ల ఆత్మహత్యలు
- ప్రభుత్వ సహాయం కోసం రైతులకు తప్పని ఎదురుచూపులు
- ఆపదలో ఉన్న అన్నదాతలను ఆదుకోవాలంటూ డిమాండ్
- నేడు జిల్లా అధికారులతో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి సమీక్ష

ఇద్దరు రైతుల ఆత్మహత్య

భారీ వర్షాలు, వరదల కారణంగా చేతికొచ్చిన పంటలు చేజారి పోవడంతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గడిచిన నెల రోజుల్లోనే ఇద్దరు రైతులు బలవన్మరణాలకు పాల్పడడం తీవ్ర ఆందోళన రేపుతుంది. అప్పుల బాధలు, సరైన దిగుబడులు రావన్న బెంగతో అన్నదాతలు ఉసురు తీసుకుంటున్నారు. బోరజ్ మండలం గూడ గ్రామానికి చెందిన కర్ల నారాయణ (58) అనే రైతు తనకున్న నాలుగు ఎకరాలతో పాటు మరో 10ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురై పంట దిగుబడులు రావన్న బెంగతో పశువుల పాకలోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే నేరడిగొండ మండలం కుమారి గ్రామానికి చెందిన పోతగంటి లస్మన్న(37) అనే రైతు వానకాల సీజన్‌లో పంటలను సాగు చేశాడు. భారీ వర్షాలతో పంటలు నీటమునిగి నేలపాలయ్యాయి. దీంతో పెట్టుబడులు చేతికి వచ్చే పరిస్థితి లేక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలో మరెంతో మంది రైతుల పంటలు నీటమునగడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు నష్టపరిహారంపై ప్రకటన చేయక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

380 ఎకరాల్లో ఇసుక మేటలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల ఉధృతికి జిల్లాలోని 7 మండలాల్లో 380 ఎకరాల పంట పొలాల్లో ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. దీంతో పంటల సాగుకు అవకాశమే లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం తీవ్రతను బట్టి పరిహారం చెల్లించాలంటూ

(తరువాయి 6వ పేజీలో....)

మండలాల వారీగా తుది నివేదిక ప్రకారం పంట నష్టం ఇలా..

మండలం	పంట నష్టం (ఎకరాల్లో)
ఆదిలాబాద్‌రూరల్	1694
ఆదిలాబాద్అర్బన్	11.20
బజార్‌హత్నూర్	765.33
బేల	1934.8
భీంపూర్	1069.6
బోరజ్	2254.2
బోథ్	451.16
గాదిగూడ	163.30
గుడిహత్నూర్	729.17
ఇచ్చోడ	368.27
ఇంద్రవెల్లి	476.32
జైనథ్	2279.27
మావల	27.13
నార్నూర్	106.15
నేరడిగొండ	1040.37
సాత్నాల	393.33
సిరికొండ	647.9
సోనాల	314.17
తలమడుగు	1054.11
తాంసి	523.23
ఉట్నూర్	1189.30


● ఆదిలాబాద్‌రూరల్ మండలంలో కొట్టుక పోయిన పత్తి పంట

అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి

● కిసాన్ మిత్ర జిల్లా కోఆర్డినేటర్

ఉట్నూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులు ఎన్‌ఎఫ్‌బిఎస్ పథకంలో 19 నుంచి 60ఏళ్ల లోపు వయసు కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని కిసాన్ మిత్ర జిల్లా కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్ రావు కోరారు. దరఖాస్తుదారుడు 12-04-2017లో మరణించి ఉండాలని నేషనల్ ఫ్యామిలీ బెన్ఫిట్ స్కీమ్, క్రింద అసహజ మరణం ప్రకృతివైపరిత్యా మరణం ఆత్మహత్యలు జరిగి మరణించిన కుటుంబానికి రూ.20,000 వస్తాయని కిసాన్ మిత్ర జిల్లా కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్ రావు తెలిపారు. దరఖాస్తుదారులు డెత్ సర్టిఫికెట్,కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జత చేసి తాహసిల్దార్ కార్యాలయంలో అందించాలని ఎలాంటి సమస్యలు ఉన్న కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ నెం.9490900800 ఫోన్ చేసి సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 వరకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని కిసాన్ మిత్ర జిల్లా కోఆర్డినేటర్ పేర్కొన్నారు.

కళాశాలల్లో ప్రవేశానికి అవకాశం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు మరొకసారి ఇంటర్ బోర్డు అవకాశం కల్పించిందని డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఇంకా ఎవరైనా ఆసక్తిని విద్యార్థులు కళాశాలలో ఈనెల 11, 12వ తేదీల్లో చేరి అడ్మిషన్ పొందాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అదేవిధంగా లాంగ్వేజ్ మార్పు చేసుకునేందుకు కూడా రెండు రోజులే అవకాశం ఉందని పేర్కొన్నారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి, జాయింట్ రిజిస్టర్ మోహన్ ను నియమించారు. అంతేకాకుండా మొత్తం పన్నెండు మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు ఎన్నికలు జరగనుండగా.. ఈనెల 12న నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ జరగనుంది. 17న పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. అదేవిధంగా ఈ ఎన్నిక ఏకగ్రీవం అయితే ఆఫీసు బేరర్ల ఎన్నిక 13వ తేదీన నిర్వహించనుండగా.. పోలింగు జరిగితే 18న జరపనున్నారు. ఎన్నికల నిర్వహణను స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

వసతి గృహ విద్యార్థులకు
మెరుగైన విద్య, వైద్యం అందించండి

● అధికారులతో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా సమీక్ష

ఉట్నూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం పీవో చాంబర్‌లో ఉమ్మడి జిల్లాల ఉప సంచాలకులు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులతో ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలను పర్యవేక్షణలు ఎన్ని చేశారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పపువ్వు లడ్డు, విటమిన్ సి ఐరన్ విలువ గల టాబ్లెట్లు విద్యార్థులకు సకాలంలో అదించే విధంగా చూడాలని ఆదేశించారు. వసతి గృహాలలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని పాఠశాలలో క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. గిరిజన కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా ఆశ్రమ పాఠశాలలకు సరుకుల సకాలంలో అందేవిధంగా చర్యలతో పాటు గిరిజన సహాయ సంక్షేమ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. వసతి గృహాలలో ఆవరణలో దోమల పొగ చేయించాలని అన్నారు. ఆర్‌వో ప్లాంట్ల పని తీరుపై ఆరా తీశారు. ఏదైనా సమస్య ఉంటే మరమ్మతులు చేయించాలని అన్నారు. ప్రిన్సిపల్ రూంలో స్కూల్ ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు పని చేసే విధంగా ఉండాలన్నారు. ప్రతి పాఠశాల అల్పాహారం మధ్యాహ్న భోజనం రాత్రి భోజనం ఫొటోలు కచ్చితంగా గ్రూప్‌లలో పొందుపరచాలని సహాయ గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యార్థులకునాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు డైట్ మెను ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు తెలపాలని అన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాల గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు జాదవ్ అంబాజి, రమాదేవి, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, అదనపు వైద్యశాఖ అధికారి కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న పీవో)


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నవజాత శిశు మరణాలపై కలెక్టర్ సమీక్ష

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల నమోదైన నవజాత శిశుమరణాలపై వివరాలు సేకరించి, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. సమావేశంలో వైద్యాధికారులు హాజరై నివేదికలు సమర్పించారు. ఐసీఎంఆర్ టీం, ఐసీఎంఆర్ సంకల్ప బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తగిన సమయానికి వైద్య సేవలు అందించడం, సక్రమమైన గర్భస్థ శిశు పర్యవేక్షణ, ప్రసూతి సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం ద్వారా నవజాత శిశు మరణాలను తగ్గించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, అదనపు డీఎంహెచ్‌ం మనోహర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

15న సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్ జూనియర్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు ఉష్కం రఘుపతి, జబడే రాష్ట్ర పాల్ తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు సెప్టెంబర్ లో నిజామాబాద్ లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహించనున్నారని వారు పేర్కొన్నారు.

ఐలమ్మ తెగువే స్ఫూర్తిగా ముందుకు సాగాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ● అధికారికంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం ● పాల్గొన్న అదనపు కలెక్టర్


ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా, పోరాటాలు చేసినా.. బీసీల బతుకుచిత్రం మాత్రం మారడం లేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ చూపిన తెగువను స్ఫూర్తిగా తీసుకుని హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వీర నారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక రిమ్స్ ఆస్పత్రి వద్ద బుధవారం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, రజక సంఘం నాయకులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనూ ఐలమ్మకు ఘన నివాళ్లు అర్పించారు. ఇందులో నాయకులు గిమ్మ సంతోష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్, తదితరులున్నారు. అలాగే, ఐలమ్మకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళ్లర్పించారు. ఇందులో జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు బండి దత్తాత్రి, తదితరులున్నారు.

మరిన్ని వివరాలు 6లో...


పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ట్రైనీ కలెక్టర్

పంట నమోదు పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపలగూడ గ్రామంలో జరుగుతున్న పంట నమోదు (డిజిటల్ క్రాప్ బుకింగ్) కార్యక్రమాన్ని జిల్లా ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా పరిశీలించారు. అదేవిధంగా వర్షాల కారణంగా రైతులు నష్టపోయిన పంట నష్టపరిహారాన్ని అధికారులు ఏ విధంగా అంచనా వేస్తున్నారన్న విషయాన్ని ట్రైనీ కలెక్టర్ వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, మండల వ్యవసాయ అధికారి నగేష్ రెడ్డి, ఏఈఓ మహేష్, రైతులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించాలి

ఆదిలాబాద్ టౌన్: విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రయోగాలు జరపాలని శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా సూచించారు. జిల్లా స్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళాను బుధవారం స్థానిక క్రీడా పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై ప్రయోగాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు.


అన్నంలో వచ్చిన పురుగులు

కేజీబీవీలో పురుగుల అన్నం

● విద్యార్థులు ఆందోళన
● నార్నూర్‌లో ఘటన

నార్నూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు భోజనం అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నా.. మరోవైపు ఆదివాసీ గిరిజన ప్రాంతంలో దీనికి విరుద్ధంగా అధికారుల పని తీరు ఉంది. తాజాగా బుధవారం నార్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు తినే ఆహారంలో ఎక్కువ మోతాదులో అన్నంలో పురుగులు ఉండడం వల్ల పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం, కూరలు, మౌలిక వసతులు.. ఇలా అన్నింటా నిర్లక్ష్యమే. బియ్యాన్ని సరిగా శుభ్రం చేయకుండానే అన్నం వండుతున్నారన్నారు. దీంతో బియ్యంతో పాటు పురుగులు ఉడికి, బాలికల ప్లేట్లలోకి

(తరువాయి 6వ పేజీలో....)


● భోజన ప్లేట్లతో ఆందోళన చేస్తున్న విద్యార్థులు


● ఇచ్చోడ మండలం ముక్రా(కె)లో యూరియా కోసం ఇంటింటికీ తిరిగి భిక్షాటన చేస్తున్న గ్రామస్థులు

తీరని యూరియా కరువు

● క్యూ లైన్‌లోనే రైతన్న పడిగాపులు 7వ పేజీలో..